క్లుప్తంగా

అమర వీరులకు వందనం



ఎర్రకోట జెడ్పీ పాఠశాలలో మొక్కను నాటుతున్న జగన్

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని ఎర్రకోట గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం అజాదీకా అమృత్ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నా భూమి – నా దేశం కార్యక్రమంలో భాగంగా వీరులకు వందనం నిర్వహించి శిలాఫలకాన్ని అవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. మాతృదేశ పరిరక్షణకు ప్రాణాలు త్యాగం చేసిన వీరులందరికీ వందనం సమర్పించారు.అనంతరం పాఠశాల అవరణలో మొక్కలు నాటారు. మండలాధ్యక్షుడు గొల్ల కేశన్న,సర్పంచ్ పెద్దమారెప్ప, ఏపీడీ అల్లిపీర, ఎంపీడీవో బంగారమ్మ, ఈవోఆర్డీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు వేలంపాట

ఆస్పరి: మండలంలోని తంగరడోణలో వెలసిన చింతలముని స్వామి, నల్లారెడ్డి స్వామి ఆరాధనోత్సవాలు ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా టెంకాయలు విక్రయించేందుకు హక్కుల వేలంపాట మంగళవారం నిర్వహించనున్న ట్లు ఆలయ కమిటీ చైర్మన్ పార్వతి సోమవారం తెలిపారు. ఆసక్తిగల వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

పంట నమోదు చేయించుకోండి

మద్దికెర: ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ రవి సూచించారు. సోమవారం మద్దికెర పరిసరాలలోని పొలాలలో పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ పొలాలలకు సంబంధించిన ధ్రువపత్రాలతో పాటు ఆధార్‌కార్డు, వన్‌బీ, బ్యాంకు ఖాతా జిరాక్స్ అందజేయాలన్నారు. అనంతరం వ్యవసాయాధికారులు పొలాల వద్దకు వచ్చి పంటలో రైతు ఉన్న ఫొటోను ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారన్నారు. ఈ క్రాప్ చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం అందించే రాయితీలు, పంటల బీమా, పంట నష్ట పరిహారం మంజూరవుతాయన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తుగ్గలి: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సోమవారం ఎంఈఓ-1 రామవెంకటేశ్వర్లు తెలిపారు. డిసెంబర్ 3న ఎన్ఎంఎంఎస్ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. పరీక్ష రుసుం జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు సెప్టెంబర్ 15 చివరి తేదీ అని చెప్పారు.

9 మంది అరెస్ట్

పత్తికొండటౌన్: పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ గ్రామంలో ఈనెల 10వ తేదీన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జరిగిన గొడవకు సంబంధించి నమోదు చేసిన కేసులో 9 మందిని అరెస్టు చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచినట్లు పట్టణ సీఐ కె.మురళీమోహన్ తెలిపారు. గొడవకు పాల్పడి, పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు చేసి పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.

విద్యాజ్యోతి చెక్కుల పంపిణీ

మద్దికెర: పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ప్రోత్సహించేలా కెనరా బ్యాంకు విద్యాజ్యోతి పథకం అమలు చేస్తోందని బ్రాంచ్ మేనేజర్ విజయచంద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కస్తూరిబా విద్యాలయంలో 10 మంది విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. 5, 6, 7 తరగతుల వారికి రూ.2500 అలాగే 8, 9, 10 తరగతుల వారికి రూ.5 వేలు చొప్పున అందజేశారు.

ఈరన్న సన్నిధికి పాదయాత్ర

పత్తికొండ రూరల్: కౌతాళం మండలం ఉరుకుంద గ్రామంలో కొలువైన ఈరన్న స్వామి సన్నిధికి పత్తికొండ నుంచి భక్తులు సోమవారం శ్రావణ మాస పాదయాత్రగా బయల్దేరారు. పాదయాత్ర కన్వీనర్ చెంచాల ఉమాపతి ఆధ్వర్యంలో తేరుబజారులోని వీరభద్రస్వామి ఆలయంలో భక్తాదులు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఈరన్న నామస్మరణతో తరలివెళ్లారు.

అర్జీలను పరిష్కరించండి

నందవరం: 'స్పందన' అర్జీలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సృజన వీడియో కాన్ఫరెన్స్‌కు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారులు హాజరయ్యారు. అనంతరం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మండలాధికారులు మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అర్జీలను నిర్లక్ష్యం చేయరాదని, సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు వైద్య శిబిరం

హొళగుంద: మండల కేంద్రంలో మంగళవారం జమాతె అహ్లెహదీస్ యువత ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక తేరు బజారులోని డ్రామా కట్ట వద్ద కర్నూలుకు చెందిన ఓమ్ని హాస్పిటల్, అక్బర్ డెంటల్ క్లీనిక్, శ్రీచక్ర నేత్రాలయం వారి సహకారంతో వైద్య శిబిరం జరుగుతుందన్నారు. వివరాలకు 70134 2700, 75697 62506 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గ్రామ పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులు

- స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నేటి నుంచి అమలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వులు
- పంచాయతీ కార్యదర్శులకు బ్యాంకు ఖాతాల ప్రక్రియ పూర్తి



ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆలూరు: గ్రామ పంచాయతీలలో పారదర్శకత పెంపొందించేలా నగదు రహిత చెల్లింపులను (డిజిటల్) అమలుచేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15 నుంచి ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు ఆయా పంచాయతీ కార్యదర్శులు మండల కేంద్రాల్లోని బ్యాంకుల్లో ఖాతాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వారం రోజుల క్రితం ఏపీ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారుల నుంచి జిల్లా పంచాయతీ శాఖ అధికారి నాగరాజునాయుడుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.ఈ ఉత్తర్వులు అమలుచేయాల్సిందిగా డివిజనల్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. అయితే ఉమ్మడి జిల్లాలో 889 గ్రామ పంచాయతీలు, 921 గ్రామాలకు చెందిన 40,53,463 మంది ప్రజలు యూపీఐ లేదా డిజిటల్ విధానంలో నగదు రహిత చెల్లింపులు చేపట్టేందుకు వెసులుబాటు కలిగింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లోని ఇంటి పన్ను, ఆస్తి, నీటి పన్ను ఇలా అనేక రకాల పన్నులను నగదు రహితంగా చెల్లించేందుకు క్యూఆర్ కోడ్ పద్ధతి, మూడు వేల నుంచి పది వేలకుపైగా జానాభా ఉన్న పంచాయతీలకు పీఎంఓ క్యాష్ ట్రాన్సాక్షన్ మిషన్లను మంజూరు చేస్తుంది.

నేటి నుంచి నగదు రహిత లావాదేవీలు

ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శికి సంబంధించిన ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు అధికారులకు జిరాక్స్ కాపీలను సమర్పించి ప్రారంభించిన ఖాతాలలో మాత్రమే నగదు రహిత చెల్లింపులను కొనసాగించాలి. సంబంధిత కాపీలను ఎంపీడీఓ, లేదా ఈఓపీఆర్డీ సంబంధిత గ్రామ పంచాయతీకి చెందిన అధికారిగా ధ్రువీకరణ చేయాలి.

ఇంటి పన్ను, నీటి పన్ను, విద్యుత్ పెండింగ్ బిల్లులు లేదా, ప్రాపర్టీకి సంబంధించిన బకాయిలను బిల్ కలెక్టర్‌గానీ, పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న సీనియర్, లేదా జూనియర్ అసిస్టెంట్లు సంబంధిత వ్యక్తుల నుంచి నగదు ముట్టుకోవడానికి వీలు లేదు. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ ఉన్నవారు నగదు రహితంగా చెల్లిస్తే అందుకు వారు బిల్లులను లబ్ధిదారుడికి మంజూరు చేయాలని గ్రామీణ, పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అక్రమాలకు తావుండదు



పంచాయతీరాజ్ చట్టంకు అనుగుణంగా సంబంధిత గ్రామ పంచాయతీలకు చెందిన కార్యదర్శులు విధులు నిర్వహించాలి. డిజిటల్ విధానంలో అవినీతి, అక్రమాలకు తావుండదు. నేరుగా ప్రభుత్వ ఖజానాలకు నిధులు జమ అవుతాయి.–ఎంపీడీఓ అల్లబకాష్, ఆలూరు

పనిభారం తగ్గుతుంది



గ్రామ పంచాయితీకి చెల్లించాల్సిన నగదులో అక్రమాలు జరగవు. గ్రామస్తులు స్మార్ట్ ఫోన్ వాడకంతోపాటు నగదు రహిత చెల్లింపులపై అవగాహన పెంచుకోవాలి. డిజిటల్ విధానంతో పూర్తి పారదర్శకంగా ఉండడంతో పాటు ఉద్యోగులపై పనిభారం తగ్గుతుంది.

– విజయ్‌కుమార్, మనేకుర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శి

వీధి కుక్క దాడిలో వ్యక్తికి గాయాలు

గోనెగండ్ల: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వీధికుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ వీరంగం సృష్టిస్తున్నాయి. కనిపించిన వారిపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. ఆదివారం రాత్రి మండల పరిధిలోని ఐరన్‌బండ గ్రామంలో మాదిగ గిడ్డయ్య అనే వ్యక్తి షాపులో చికెన్ తీసుకుంటుండగా అతనిపై కుక్క దాడిచేసింది. దాడిలో గిడ్డయ్య కాలుకు గాయమైంది. ఆయన్ను కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అదే గ్రామంలో రెండు రోజుల క్రితం ముని, బాషాపై కుక్క దాడి చేసి గాయపరిచింది. వీరితో పాటు మండలంలో ఈ నెలలోనే మరో 7 మంది కుక్క కాటుకు గురయ్యారు. గోనెగండ్లలో ముగ్గురు, హెచ్. కైరవాడిలో ఇద్దరు, ఎర్రబాడులో ఒకరు, బైలుప్పలలో ఒకరు కుక్కల దాడిలో గాయపడ్డారు, వీరందరూ గోనెగండ్ల ఆస్పత్రిలోనే టీకాలు వేయించుకుంటున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. పంచాయతీ అధికారులు స్పందించి ప్రజలు వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రీసర్వేతో భూవివాదాల పరిష్కారం



భూహక్కు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: గ్రామాలు, పట్టణాల్లోని భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి 'జగనన్న భూహక్కు, భూ రక్ష పథకం చక్కని మార్గం అని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నందవరం మండలంలోని పూలచింత గ్రామానికి చెందిన 10 మందికి వారి ఇళ్లకు సంబంధించిన భూహక్కు పత్రాలను ఎమ్మెల్యే తన నివాసంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర సర్వే ద్వారా భూములను పక్కాగా సర్వే చేసి హద్దులను చూపుతూ హక్కు పత్రాలను అందించడం వల్ల భవిష్యత్తులో భూ సమస్యలు తలెత్తవన్నారు. భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం సమగ్ర సర్వే చేపట్టిందని వివరించారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథరామయ్య తదితరులు ఉన్నారు.

ఏకగ్రీవాల హోరు



కలుగొట్ల 11వ వార్డుకు ఏకగ్రీవంగా ఎన్నికైన బోయ గాలెమ్మకు డిక్లరేషన్ అందిస్తున్న ఆర్ఓ

వెల్దుర్తి: మండల పరిధిలో ఖాళీగా ఉన్న 4 వార్డు మెంబరు స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసిపోగా కలుగొట్ల, కృష్ణాపురం పంచాయతీలలో ఒక్కో వార్డుకు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం నామినేషన్ల ఉపసంహరణ సమయం పూర్తయిన అనంతరం కలుగొట్ల 11వ వార్డు మెంబరుగా బోయ గాలెమ్మ, కృష్ణాపురం పంచాయతీ సిద్ధినగట్టు 10వ వార్డు మెంబర్‌గా మాదాసు మహేశ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్‌ఓలు మునెయ్య, సురేంద్రనాథ్ రెడ్డి ప్రకటించి డిక్లరేషన్ అందించారు. తమ ఏకగ్రీవానికి కృషి చేసిన ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులకు నూతన వార్డు మెంబర్లు కృతజ్ఞతలు తెలిపారు. కాగా బొమ్మిరెడ్డిపల్లె 3వ వార్డు స్థానానికి పోటీలో ఉన్న ఎల్లమ్మకు గౌను గుర్తు, కోదండపాణికి కుక్కర్ గుర్తు కేటాయించినట్లు ఆర్‌ఓ రమేశ్ తెలిపారు. అలాగే ఎల్.నగరం పిక్కిలివాని పల్లె 2వ వార్డు మెంబర్ స్థానానికి పోటీలో ఉన్న నక్క లోకేశ్‌కు కుక్కర్ గుర్తు, శీను నాయక్‌కు గౌను గుర్తు కేటాయించినట్లు ఆర్‌ఓ అక్బర్ బాష తెలిపారు. ఈ నెల 17వ తేదీ వరకు అభ్యర్థులు ఎన్నికల నిబంధనల మేరకు ప్రచారం చేసుకోవచ్చని, 19న ఎన్నికలు ఉంటాయని ఎన్నికల అధికారి/ఎంపీడీఓ శ్రీనివాసరావ్ తెలిపారు.

హొళగుంద: వార్డు మెంబర్ల ఖాళీ స్థానాలకు జరిగే ఎన్నికలకు గాను సోమవారం నామినేషన్ల ఉప సంహరణ కార్యక్రమం ముగిసింది. చిన్నహ్యోట 9వ వార్డుకు ఈరమ్మ, సీహెచ్ మంగమ్మ, మద్దిలింగదహళ్లి 3వ వార్డుకు హరిజన మరియమ్మ, గోపాలమ్మ పోటీలో ఉండగా సుళువాయి 7వ వార్డుకు బోయ వరలక్ష్మి నామినేషన్ మాత్రమే మిగలడంతో ఆ వార్డు ఏకగ్రీవం అయ్యింది. ఈ వార్డుకు దాఖలైన 4 నామినేషన్లలో మూడు తిరస్కరణకు గురై వరలక్ష్మి మాత్రమే మిగిలింది. బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు జరిగింది. ఈ నెల 19న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుందని జిల్లా సహాయక ఎలక్షన్ అథారిటీ (ఏడీఈఏ), ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ విలేకరులకు తెలిపారు.

చిప్పగిరి: మండలంలోని ఏరూరు గ్రామంలో 5వ వార్డు స్థానానికి రాగులపాడు సుమాంజలి, కుందనగుర్తి గ్రామంలో 7వ వార్డు స్థానానికి కొండా రేణుకమ్మ మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారులు విజయ లక్ష్మి, బాలనాయుడు తెలిపారు. ఈ మేరకు అభ్యర్థులకు సోమవారం డిక్లరేషన్ పత్రాలు అందించారు.

క్రైం కార్నర్

బైకులు ఢీకొని ఒకరి మృతి



మృతి చెందిన వడ్డె నరసింహులు

ఎమ్మిగనూరు రూరల్: పట్టణ సమీపంలోని ఆదోని రోడ్డు అగ్నిమాపక కేంద్రం వద్ద సోమవారం సాయంత్రం రెండు మోటార్ బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనటంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. మండల పరిధిలోని బనవాసి గ్రామానికి చెందిన వడ్డె నరసింహులు పట్టణంలో పని ముగించుకుని బైక్‌పై ఊరికి వెళ్తుండగా బనవాసికి చెందిన అశోక్, వంశీ బైక్‌పై ఎమ్మిగనూరు వస్తున్నారు. అగ్నిమాపక కేంద్రం సమీపంలో రెండు బైకులు ఢీకొనడంతో వడ్డె నరసింహులు (43) మృతి చెందగా అశోక్, వంశీలకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు నరసింహులుకు భార్య జయలక్ష్మి, ఇంటర్ చదివే కుమారుడు మహేంద్ర, 9వ తరగతి చదివే కుమార్తె రాధిక ఉన్నారు. మృతుడు బెల్దార్ మేస్త్రీగా పనిచేసేవాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయినట్లు కుటుంబ సభ్యులు బోరున విలపించారు. గాయపడిన అశోక్, వంశీలకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ సురేస్‌బాబు తెలిపారు.

పాము కాటుతో మహిళ..



చాకలి ఉరుకుందమ్మ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఏనుగుబాల గ్రామంలో సోమవారం పొలంలో కూలీ పనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో చాకలి ఉరుకుందమ్మ (35) మృతి చెందింది. ఉరుకుందమ్మ కూలీ పనులకు వెళ్లి పొలంలో పనిచేస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన తోటి కూలీలు వెంటనే దైవందిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందింది. మృతురాలికి కుమారులు రాజు, పరుశురాం, కుమార్తెలు గీత, మంజుల ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీజేపీ నాయకుడి కన్నుమూత



ఈడిగ రంగాగౌడ్ (ఫైల్)

పత్తికొండ రూరల్: పత్తికొండ బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఈడిగ రంగాగౌడ్ (48) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకుడిగా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేశారు. జర్నలిస్టుగా పనిచేస్తూ ప్రజల సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారు. ప్రస్తుతం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న రంగాగౌడు మూడు రోజుల కిందట అనారోగ్యానికి గురై హైదరాబాదులోని యశోదా హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య అలివేలమ్మ, కుమారుడు బాబ్జిగౌడ్, కుమార్తె చందన ఉన్నారు. ఈయన మృతి పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు సంతాపం తెలిపారు.

నవరత్నాలతో ఇంటింటా సంక్షేమ కాంతులు



బేవినహాళ్‌లో వృద్ధురాలికి సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: నవరత్నాల సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఇళ్లలో సంక్షేమ కాంతులు నింపారని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. హాలహర్వి మండలం బేవినహాళ్ గ్రామంలో జయశ్రీ, బసవరాజ్‌గౌడు సమక్షంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో గ్రామానికి రూ.6.44 కోట్ల మేర సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి చేకూరిందన్నారు. గ్రామంతో పాటు శ్రీధర్‌హాళ్, చాకిబండ గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు జల్‌జీవన్ మిషన్ ద్వారా అదనంగా పైపులైన్లు, డ్రైనేజీలు, సీసీ రోడ్ల పనులకు వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీల్లో గృహాలు, వైఎస్సార్‌హెల్త్ క్లీనిక్‌లు, ఆర్‌బీకే, సచివాలయ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణస్వామి, ఎంపీపీ నెట్టకంఠమ్మ, వైస్ ఎంపీపీ నాగేష్, జెడ్పీటీసీ లింగప్ప, శ్రీనివాసులు, బజారప్ప, భాగ్యమ్మ, ఓబులపతి, నాగేంద్ర, సద్దాం, రామన్న, దుబ్బలింగ, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న మంత్రిని స్థానిక నాయకులు పూలమాలలతో సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మంత్రి జయరాం మాట్లాడారు. దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను మరువరాదని సూచించారు.

పవన్‌కల్యాణ్‌కు అధికారం పగటికలే

మాజీ సీఎం చంద్రబాబునాయుడు కాళ్లు పట్టుకుని భజన చేసినా జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు అధికారం దక్కనీయడని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం జోస్యం చెప్పారు. హాలహర్వి మండలం బేవినహాళ్ గ్రామంలో సోమవారం మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రను తిరగేస్తే వైఎస్ కుటుంబం ఎల్లప్పుడూ పేదల సంక్షేమం కోసం నిరంతరం పనిచేసిందన్నది తెలుస్తుందన్నారు. ప్రజల ముందుకు వచ్చి ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా, ఎన్ని కష్టాలు ఎదురైనా నెరవేర్చే సత్తా వారికే దక్కుతుందన్నారు. ప్రజాసేవకు అంకితమై విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్లపై పవన్‌కల్యాణ్ ఇష్టానుసారంగా మాట్లాడడం తగదన్నారు. గత టీడీపీ హయంలో మహిళలపై జరిగిన దాడులు కనిపించలేదా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల తర్వాత టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, పవర్‌లెస్ స్టార్ పవన్‌కల్యాణ్‌కు రాజకీయ సన్యాసం తప్పదని, వారిని ఇంట్లో కూర్చొబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

గ్రామ స్వరాజ్యం కల సాకారం



పత్తికొండలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: ప్రభుత్వ పరిపాలనను ప్రతి గడపకు చేరువచేసి గ్రామ స్వరాజ్యం కలను సాకారం చేసిన ప్రజానాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం సాయంత్రం పత్తికొండ గ్రామ సచివాలయం-5 పరిధిలోని 18, 19వార్డులలోని బ్రాహ్మణవీధి, మడ్డిగేరి, బ్రహ్మయ్య కొట్టాల, కుమ్మరివీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 380 ఇళ్లను సందర్శించి కుటుంబసభ్యులతో మాట్లాడారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. పలు చోట్ల సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం గుర్తించిన సమస్యలను ప్రాధాన్యతపరంగా నిధులు కేటాయించి పరిష్కరించేందుకు తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఏటా సంక్షేమ క్యాలెండర్ విడుదల చేసి, ఆయా తేదీలలో కచ్చితంగా పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98.9 శాతం అమలు చేశారని కొనియాడారు. ఎంపీపీ నారాయణదాసు, మాజీ ఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ, సర్పంచ్ కొమ్ముదీపిక, మాజీ సర్పంచ్ సోమశేఖర్, ఎంపీడీఓ కవిత, సీఐ మురళీమోహన్, ఎస్ఐ గోపాల్, ఈఓ నరసింహులు, నాయకులు టీఎండీ హుసేన్, శ్రీరంగడు, మండల కన్వీనర్ కారం నాగరాజు, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడి నడకతో పులకించిన నేల



పెరవలిలోని గాంధీ విగ్రహం

మద్దికెర: తెల్లవారి కబంధ హస్తాల నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు ప్రతిఒక్కరినీ ఉత్తేజ పరిచేలా దండి ఉద్యమంలో భాగంగా మహాత్మాగాంధీ మండల పరిధిలోని పెరవలి గ్రామంలో పర్యటించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. 1929లో దండి ఉద్యమానికి ముందు బాపూజీ గుత్తి నుంచి పెరవలి మీదుగా ఆస్పరి వెళ్లాడని వృద్ధులు చెప్పారు. అందుకు గుర్తుగా 1960 నవంబర్ 6న మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్నప్పుడు కారుమంచి అంజినయ్య పంచాయతీ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహావిష్కరణ చేశారు. గాంధీ మహాత్ముడు పర్యటనకు వచ్చినపుడు కళ్లజోడు లేకుండా వచ్చారని, అందుకు గుర్తుగా ఇక్కడి విగ్రహానికి కళ్లజోడు లేకుండా నిర్మాణం చేపట్టారని గ్రామస్తులు తెలిపారు.

గర్వంగా చెప్పకుంటాం

మా గ్రామానికి మహాత్మ గాంధీ వచ్చాడని ఇప్పటికీ గర్వంగా చెప్పుకుంటాం. ఆ అదృష్టం మాకు కలిగినందుకు సంతోషంగా ఉంది. ఆయన వచ్చి వెళ్లాడని మా పెదనాన్న కారుమంచి అంజనయ్య సర్పంచ్‌గా ఉన్నపుడు విగ్రహ ఆవిష్కరణ జరిగిందని మా పెద్దలు చెబుతుండేవారు.

– కారుమంచి మల్లికార్జున, సర్పంచ్

స్మారక స్తూపం.. త్యాగధనుల జ్ఞాపకం



ఆలూరు రూరల్: స్వాంతంత్ర్యోద్యమ పోరాటంలో ఆలూరుకు విశిష్ట స్థానం ఉంది. ఉద్యమానికి 11 మందిని అందించిన ఘనత ఈ ప్రాంతానిది. సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని వర్గాల వారు స్వాతంత్య్ర పోరాటంలో కీలక పాత్ర పోషించారు. నాటి పోరాట యోధుల జ్ఞాపకార్థం స్వాతంత్య్రం వచ్చి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 1972 ఆగస్టు 15న భారత సంవిధానం పేరిట అప్పటి సమితి కార్యాలయం (ఇప్పటి ఎంపీడీఓ కార్యాలయం) ఆవరణలో భారత ప్రభుత్వం ఓ స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేసింది. మహాత్ముని పిలుపు మేరకు సంజీవ రెడ్డి, అక్బర్ అలీ, పుల్లా అయ్యపు రెడ్డి, సీతారామి రెడ్డి, బసవన్న గౌడ్, బొగ్గుల బాలయ్య, నరసింహా రెడ్డి, రామకృష్ణా రెడ్డి, బోయ హనుమప్ప నాయక్, గోవింద దాస్, పాపయ్య చౌదరి సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారు. జైళ్లకు వెళ్లారు. విలువైన ఆస్తులను పోగొట్టుకున్నారు. నాటి సమరయోధుల పేర్లతో పాటు అశోక చక్రం, జాతీయ చిహ్నాలైన తామర పువ్వు, నెమలి, సింహం బొమ్మలతో రజతోత్సవ విశేషాలను హిందీ, తెలుగు భాషల్లో ఈ స్తూపంపై చెక్కారు. ఇది నాటి చరిత్రకు సజీవ సాక్ష్యంగా, నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

ఫర్టిలైజర్ షాపుపై విజిలెన్స్ దాడి

దేవనకొండ: మండల కేంద్రంలోని టర్నింగ్ వద్ద గల రవి కిరణ్ ట్రేడర్స్‌లో విజిలెన్స్ అధికారులు సోమవారం సోదాలు జరిపారు. ఈ సోదాల్లో రూ.4.20 లక్షల ఉత్పత్తులు స్టాప్ సేల్, మొత్తం రూ.8 లక్షలు సరుకు సీజ్ అయ్యిందని, షాపునకు గోడౌన్‌కు లింక్ లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఏఓ సురేష్‌బాబు తెలిపారు.ట్రేడర్స్ నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విగ్రహం అపహరించిన వారిపై చర్యలు తీసుకోవాలి

నందవరం: మండల పరిధిలోని పోనకలదిన్నె గ్రామంలో సోమవారం తెల్లవారుజామున అంబేడ్కర్ విగ్రహం అపహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు పోగుల రంగన్న, అబ్రేసు, నరసప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఎస్ఐ తిమ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలో సోమవారం అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాల్సి ఉండగా తెల్లవారుజామున విగ్రహం ఎత్తికెళ్లారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యా సామగ్రి పంపిణీ

పత్తికొండ రూరల్: స్థానిక ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం కేపీఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పెన్నులను సంస్థ అధ్యక్షుడు రామ్మోహన్, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు.

సాగు చేసిన పంటలనే నమోదు చేయాలి

కృష్ణగిరి: ఏ పంట సాగుచేస్తే అదే పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని ఏఓ ఎస్.వెంకటేశ్వర్లు సిబ్బందికి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. సాగుచేసిన ప్రతి పంటకు బీమా ఉంటుందని ఈ విషయాన్ని రైతులు గుర్తించి సాగుచేసిన పంటలనే నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదులో తప్పులు దొర్లితే అగ్రికల్చర్ అసిస్టెంట్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.